పెద్దకథ

# రౌద్రాగ్ని

ఆర్వీరమణప్రసాద్

(గతసంచిక తరువాయి)

మర్నాడుదయం హుషారుగా నిద్రలేచాడు ప్రభుదాస్. మరో కొత్త పథకానికి రూపకల్పన యివ్వసాగాడు. ఆ రాత్రికి అమలుజరగాలది...ఎలాగైనా.

మరో బ్యాంకు దోపిడీ నిరాటంకంగా చెయ్యొచ్చు. మొన్న తాము చేద్దామనుకున్న దోపిడీ విఫలం కావడం వల్ల తాము చేసిన హత్యలు వ్యక్తిగత కక్షలతో చేసిన హత్యలుగా ప్రచారం పొందాయి. కాబట్టి బ్యాంకుల దగ్గర నిఘా అధికంచేసే ఉద్దేశం పోలీసులకి కలగలేదు. తన అనుచరుల ద్వారా ఈ సమాచారం అందింది తనకి.

ప్రభుదాస్ వేసుకునే ప్లాన్‌కి తిరుగుండదు. ముందుగానే దోచుకోబోయే బ్యాంకుకి సంబంధించిన సమాచారమంతా సేకరిస్తాడతను. అవసరాన్ని బట్టి ఆ బ్యాంకులో తన పేర్న ఒక లాకర్ కూడా ఓపెన్ చేస్తాడు. తన వద్దనున్న ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా ఆ బ్యాంకుకి వున్న సెక్యూరిటీ డివైజెస్ అన్నీ కుణ్ణంగా తెలుసుకుంటాడు. వాటన్నిటినీ నిర్వీర్యం చేసి తన పని ఎలా సాధించుకోవాలో నిర్ణయించుకుంటాడు. ఇప్పటి వరకు అపజయమన్నది లేదు. రెండురోజుల క్రితం జరిగిన సంఘటన కూడా అపజయం కిందకి లెఖ్ఖరాదు. అది కేవలం యాదృచ్ఛికం. అది కూడా ఎంతవరకు నిజం? మనం చూసే దంతా నిజమే నని నమ్మడానికి గ్యారంటీ ఏమిటి?

ప్రభుదాస్‌కి తన తండ్రి గుర్తుకొచ్చాడు.

చేయని నెరానికి బలైపోయాడు తన తండ్రి. అతను ఒక భూస్వామి దగ్గర పాలేరుగా పనిచేసేవాడు. ఒక రోజు ఉదయం నాలుగ్గంటల వేళ కాలకృత్యాలు తీర్చుకుందుకని గ్రామం వెలుపల వుండే బయలు ప్రదేశానికి వెళ్ళాడతను. అక్కడ కనబడిందతనికో ఘోరమైన దృశ్యం. భూస్వామి, అతని సోదరుడు కలిసి తమ వద్ద పనిచేస్తున్న మరో పాలేరుని తలమీద కర్రతో బాది చంపి ఉరి వేసుకున్నట్టుగా చెట్టుకి వేలాడదీసారు. ఆ దృశ్యం అంతా చూసాడు తన తండ్రి. చూసి ఆగ్రహావేశుడయ్యాడు. మిమ్మల్ని పోలీసులకి పట్టిస్తానని భూస్వామిని బెదిరించి టౌనువేపు పరిగెత్తాడు. అతను పోలీసుల్ని వెంటబెట్టుకొచ్చేసరికి ఉదయం తొమ్మిది గంటలయింది. అప్పటికే శవం చుట్టూ జనం మూగి వున్నారు. భూస్వామి విచారం అభినయిస్తూ వారితో ఏదో చెబుతున్నాడు. పోలీసుల్తో తిరిగి వచ్చిన తన తండ్రిని చూసి అతనేం తొట్రుపడలేదు. సంగతంతా విన్నాక అతను పోలీసులకి మరో కథల్లి చెప్పాడు. ముందురోజు ఉదయం తమ యింట్లో ఒక ఏభై తులాల వెండికంచం కనబడకుండా పోయిందనీ, చనిపోయిన పాలేరు తమ వద్దకు వచ్చి కంచం దొంగిలించిన వ్యక్తిని తాను చూశాననీ, యిరవై నాలుగ్గంటల్లోగా కంచంతో సహా సదరు వ్యక్తిని తమ ముందు హాజరు పరుస్తానని చెప్పి వెళ్ళాడనీ, ఆ తర్వాత మళ్ళీ ఈ పరిస్థితిలోనే దర్శనమిచ్చాడనీ, కంచం దొంగిలించిన వ్యక్తెవరో తెలిస్తే మొత్తం కేసంతా బయటకి వస్తుందనీ, అప్పటి వరకు శవాన్ని ముట్టుకుందికి వీల్లేదని ఖండితంగా చెప్పాడు.

పోలీసులప్పటికప్పడే గ్రామస్థులందరి సమక్షంలోనూ కంచాన్ని వెదకడానికి బయల్దేరారు. సులువుగానే దొరికింది కంచం. తన తండ్రి పాకలోనే భూమిలో పాతిబెట్టబడి వుంది. మతిభ్రమించిన తన తండ్రి భూస్వామి కాళ్ళావేళ్ళాబడి తనకి అన్యాయం చెయ్యొద్దని వేడుకున్నాడు. భూస్వామి పోలీసుల్తో మాట్లాడి ఏదో చెప్పి వారిని పంపేశాడు.

మిగిలిన కథేదో ఆ రాత్రే జరిగిపోయింది. యజమాని ఉప్పు తింటూ అతన్నే నాశనం చెయ్యడానికి తలపెట్టాడన్న అభియోగం తన తండ్రిపైన మోపబడింది. భూస్వామి మద్దతుదారులు కొందరు ఆగ్రహావేశ పరులైన ప్రజల్ని వెంటబెట్టుకుని తన తండ్రి మీద దాడి చేశారు. అతన్ని చెట్టుకి కట్టి గొడ్డుని బాదినట్టు బాదారు. ఆ దెబ్బలకి తన తండ్రి శరీరమంతా తూట్లు పడిపోయింది. మూడు రోజులు నరకయాతన అనుభవించి ఈ లోకాన్ని వదలి వెళ్ళిపోయాడతను.

అప్పటికి తన వయస్సయిదేళ్ళు మాత్రమే. తనూ, తన తల్లీ పాలేరు శవాన్ని చూడ్డానికి సంభ్రమంగా పరిగెత్తుకెళ్ళిన సమయంలో భూస్వామి మనుషులు వచ్చి తమ యింట్లో కంచం పాతిపెట్టారన్నసంగతిగ్రహించు కోగలిగినంత వయస్సు కాదది.

"ప్రభూ..." అనుచరుడి పిలుపుతో యిహలోకంలోకి వచ్చాడు ప్రభుదాస్.

"అందరూ వచ్చారు ప్రభూ" చెప్పవలసింది చెప్పి అనుచరుడు వెళ్ళిపోయాడు.

హాల్లోకి వచ్చాడు ప్రభుదాస్. ఎప్పటిలాగే అందరూ అర్థవృత్తాకారంగా నించుని వున్నారు...తన ఆదేశాల కోసం.

ఎప్పటిలాగే టేబిల్‌పైన విస్కీ సీసా, గ్లాసు సిద్ధంగా వున్నాయ్. వాటితో బాటే ఆ రోజు పేపరు కూడా




టేబిల్ పైన వుంది.

కుర్చీలో కూర్చున్నాడు ప్రభుదాస్.

"గుడ్ ఈవినింగ్ ప్రభుదా"

మౌనంగా తలపంకించాడు ప్రభుదాస్.

అనుచరులకి ఆదేశాలిచ్చే ముందు కొంతసేపు కళ్ళుమూసుకుని మౌన ముద్ర వహించడం అలవాటు ప్రభుదాకి. ఆ రోజు కూడా అలానే మౌనం వహించాడు. ఆ తర్వాత ఆదేశాలివ్వడానికి నెమ్మదిగా కనులు తెరిచాడు.

'హాస్పిటల్ నుంచి అదృశ్యమయిన యోగి'

ఎదురుగా పేపర్లో వార్త!

త్రుటిలో పరిసరాల్ని మరచిపోయి పేపరు మీద లగ్నమయిపోయింది ప్రభుదాస్ మనస్సు

'పరీక్షల నిమిత్తం నిన్న ఉదయం హాస్పిటల్లో ఎడ్మిట్ చెయ్యబడ్డ బ్యాంక్ ఆఫీసర్ శ్రీ యశస్వి రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో అతి సునాయాసంగా హాస్పిటల్ నించి తప్పించుకు పారిపోయారని హాస్పిటల్ అధికారులు తెలియచేస్తున్నారు. ఆ సమయంలో [illegible] చెప్పిన కథనం ప్రకారం

యోగి... అంటే శ్రీ యశస్వి... వుంటున్న వార్డులోనే ఎపెండిసైటిస్‌తో బాధపడుతున్న ఒక రోగి రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో బాధ భరించలేక హాస్పిటలంతా దద్దరిల్లిపోయేలా కేకలు వేయసాగాడు. నర్సు గాభరాగా అతని దగ్గరకి పరిగెత్తి నిద్రవుచ్చడానికి ఇంజక్షనిచ్చింది. కాని ఆ ఇంజక్షను అతని మీద పని చేయలేదు. ఏం చెయ్యాలో తెలియక నర్సు అయోమయంగా అటూ ఇటూ చూస్తున్న తరుణంలో ఆ పేషెంటుకెదురుగా వున్న బెడ్‌మీద కళ్ళు తెరుచుకుని నిశ్చలంగా పడుకుని వున్న యోగి నెమ్మదిగా పక్క మీంచి లేచి అరుస్తున్న ఆ పేషెంటు దగ్గరికొచ్చాడు. నర్సు చేష్టలుడిగి అతనేం చెయ్యబోతున్నాడోనని ఉత్కంఠతో చూడసాగింది. యోగి నెమ్మదిగా తన చేత్తో ఆ పేషెంటు పొట్టమీద నిమిరాడు. ఆశ్చర్యం! అంతవరకూ కేకలేస్తున్న ఆ పేషెంటు ఒక్కసారిగా మౌనం వహించి ప్రశాంతంగా నిద్రలోకి జారి పోయాడు. నర్సింకా విభ్రాంతి నించి తేరుకోకముందే యోగి హాస్పిటల్ బయటికి నడిచాడు. హాస్పిటల్‌కి కాపలా కాస్తున్న గేట్‌మాన్ అతన్ని చూస్తూనే అవాలీలగా గేటు తెరిచాట్ట. ఇప్పటివరకు పోలీసులెంత గాలించినా యోగి జాడ లేదు.'

యోగి...యోగి...యోగి...

ఎక్కడ చూసినా అతని పేరే! ఎవరి నోట విన్నా అతని గురించే! ఎందుకిలా అతని గురించి ఆసక్తి చూపిస్తున్నారు ప్రజలు? మతిభ్రమించిన వ్యక్తని తెలిసికూడా ఎందుకు అతను చేసే ప్రతి చేష్ట గురించి వింతగా చెప్పుకుంటున్నారు? అతని గురించిన ప్రతి వార్త పేపర్లలో అంత ప్రముఖంగా ప్రచురించాల్సినంత అవసరమేమొచ్చింది?

ప్రభుదాస్ మనస్సు వికలమైపోయింది.

సొరుగులోంచి మరొక మూత్రరూపాయల కట్టపైకి తీశాడు. అనుచరుల వైపు విసిరాడు.

రెండోరోజు సమావేశం ముగిసింది.

** ** **

ఎంత వదిలించుకుందామన్నా యోగి గురించిన ఆలోచనలు తనని వెన్నాడుతున్నాయ్... మూడోరోజు నిద్రలేవగానే అనుకున్నాడు ప్రభుదాస్. అతని వేపుగా తనని లాగుతున్న శక్తేమిటి? లేదా తన బలహీనత వల్లే అతని పట్ల తనిలా ప్రభావితుడవుతున్నాడా? ఏమో! ...... అదే నిజమై వుండవచ్చు. పేపర్లో చదువుతున్న వార్తలు, అనుచరులు చెప్తున్న సమాచారం వల్ల తన మనస్సు అతని పట్ల ఆకర్షితమై వుంటుంది. అంతకంటె యిందులో ప్రత్యేకతేమీ లేదు.

ప్రభుదాస్ లేచి వాష్‌బేసిన్ దగ్గర మొహం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ అద్దంలో చూసుకున్నాడు.

ఎర్రటి జీరల్తో తన కళ్ళు తనకే భయంకరంగా వున్నాయ్. ఆ కళ్ళలోనే వుంది తన శక్తంతా. ఆ కళ్ళతో తనెవరినైనా తీక్షణంగ చూశాడంటే ఆ నాటితో ఆ వ్యక్తికి భూమ్మీద నూకలు చెల్లినట్టే!

జేబులోంచి స్ప్రింగ్‌నైఫ్ పైకి తీశాడు. బటన్ నొక్కగానే ఛక్‌మని ప్రత్యక్షమయింది తళతళలాడే చాకు. ఆ చాకుని చెంపకి ఆనించుకుని తనలో తానే వికృతంగా నవ్వుకున్నాడు ప్రభుదాస్.

ప్రభుదాస్‌ని మించిన శక్తివంతుడు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో మరొకడు లేడు. ప్రభుదాస్ దాదా పేరు చెప్తే ఏడుస్తున్న పసిపిల్లలు కూడా ఏడుపు మానేస్తారంటే అతిశయోక్తి కాదు. అంత పవర్‌ఫుల్ నేమ్ అతనిది. దేశంలోనే అతి భయంకరమైన గ్యాంగ్‌ని తీర్చిదిద్దిన ఘనత ప్రభుదాస్‌దే! చట్టానికి పట్టుబడకుండా నేరాలు చెయ్యడంలో అతను అద్వితీయుడు. మొదట్లో కొన్నాళ్ళు అనుమానం మీద అతన్ని అరెస్టు చేస్తుండే వారు పోలీసులు. కాని అతనిమీద నేరాలు ఋజువు చెయ్యలేక విడిచిపెట్టవలసి వచ్చేది. ఆ తర్వాత వారు కూడా ప్రభుదాస్‌కి దూరంగా వుండసాగారు. కారణం? నేరస్తుడని పట్టుకున్నాక నేరం రుజువు చెయ్యలేకపోతే ప్రజల్లో మరింత తలవంపులు, మరింత ఆందోళన. ప్రభుదాస్ గురించి చూచాయగా తెలుసుకున్న రాజకీయ నాయకులు తమ ప్రత్యర్థుల్ని తుదముట్టించడానికి అతన్ని ఆయుధంగా వాడుకున్నారు. అయితే ప్రత్యర్థులు కూడా అందుకు తీసిపోలేదు. వారు కూడా అతనికి పుష్కలంగా ముట్టచెప్పి తమ విరోధుల్ని తిరుగు దెబ్బ కొట్టసాగారు. ఫలితం!

ఆ చేత్తో ఈ చేత్తో డబ్బు ఆర్జించసాగాడు ప్రభుదాస్. సంగతి తెలుసుకున్న రాజకీయ నాయకులు తేలుకుట్టిన దొంగల్లా నోర్మూసుకుని లెంపలువాయించుకుని అతనికి దూరంగా వుండసాగారు. ఈ విధంగా చట్టానికీ, ప్రభుత్వానికీ అతీతంగా పెరిగిపోయాడు ప్రభుదాస్.

'ప్రభుదాస్ ఎక్కువగా మాట్లాడడు. అతని తుపాకీయే ఎక్కువగా మాట్లాడుతుంద'ని నానుడి.

ప్రభుదాస్‌దాదా!

ప్రభుదాస్‌దా!

ప్రభుదాస్!

ప్రభుదా!

ప్రభూ!

ఎవరే విధంగా పిలిస్తేనేం? ప్రతి అక్షరంలోనూ కర్కశత్వం ఉట్టిపడుతుంది... అతని పేరులో...

"ప్రభూ"

ప్రభుదాస్ వెనక్కి తిరిగాడు.

"పేపరు... చూస్తారా" అనుచరుడి ముఖంలో దాచుకోలేని ఆతృత!

"వద్దు"

అనుచరుడు వెనక్కి తిరిగాడు.

"ఆగు"

అనుచరుడు ఆగాడు.

"ఓమారిలా య్యియ్యి"

పేపరందించి వెళ్ళిపోయాడతను.

'ప్రజల్లో సంచలనం సృష్టిస్తున్న యోగి' — 'యోగిగా మారిన బ్యాంక్ మేనేజర్ శ్రీ యశస్వి ప్రజల్లో తీవ్రమైన సంచలనాన్ని సృష్టిస్తున్నాడు. అతన్ని గురించిన అనేక వింత సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయ్. మొన్న రాత్రి హాస్పిటల్ నించి అదృశ్యమైన యోగి పోలీసులకి కన్పించకపోయినా ప్రజల్లో చాలా

## ఏసు జన్మకథ

పాకలో ప్రభువు
పుట్టిన వేళ
లోకము నాకమై
పాడింది జోల దూతల రాగాల
పిలిచింది జ్ఞానులా
ఏదెను తోటలో ఆదాము చేసిన
ప్రథమ పాపము

సదయుని సన్నిధితుదిలేని పెన్నిధి
దూరము చేయగా
నరులలో ఒకడైననశియించిపోవుట
భరియింప జాలక
కరుణామయుడగు తండ్రి నరి
దిద్దు గురువుగ
మరియకు జన్మించెను

పూలబాలకు చిగురాకు పడకల
సొగసుగూర్చిన
ఆకాశ పక్షులను అందాల గూండ్లతో
ఆదరించిన
భూలోక మంతయు ఏలుకొమ్మని నరుని
పిలిచి యిచ్చిన
భూరి ప్రేమామయుడు కోరినేలకురాగా
కరవాయె స్థలమింతయు

నీలాల నింగి నేలకు వంగి
మరియ ముంగిట
చక్కని చుక్కను చీకటి పాకకు
దీపము చేసెను
పరలోకపాపడుపాలు ద్రావుటకేమొ
పశువుల పాలురు
పాలమీగడలిచ్చి పసివాడి కన్నుల
వెన్నెలు మెక్కిరి

యుగములనేలు జగములరేడు
దిగిరాగ దీనుడై
సింహాసనము కొరకు సంహరింపగబూనె
హేరోదు హీనుడై
మరణపుముల్ వైరము పరమున్ద్రుతుండనుచు
ధరణికి చాటను
చిరుత ప్రాయము నాడె మరణగండము గడచి
శరణాయె నరులకు

-ఎ. కె. రేడు

మందికి కన్పించినట్లు చెప్పుకుంటున్నారు. అతను తమ ప్రాంతంలో తిరుగుతూ వుండగా చూసామని కొందరంటూంటే లేదు మా ప్రాంతంలో తిరుగుతున్నాడని కొందరంటున్నారు. ఇంతకీ అతనిప్పుడెక్కడున్నాడని ప్రశ్నిస్తే మాత్రం ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇదిలా వుండగా నగరానికి దగ్గర్లో వున్న... గ్రామంలో కాపురముంటున్న ఓ పల్లె యువకుడు మొన్న రాత్రి హైవే మీద తనకి యోగి కన్పించినట్లు, తన భార్య శీలాన్ని అపహరించబోతున్న దుండగుల బారి నుండి ఆమెని రక్షించినట్టు చెబుతున్నాడు. ఆ యువకుడు చెబుతున్న కథనం ఈ విధంగా వుంది. కొత్తగా పెళ్ళి చేసుకున్న ఈ యువకుడు సినిమాకని భార్యతో బాటు సైకిల్ మీద మొదటి ఆట సినిమా చూడ్డానికి నగరానికి వచ్చాడు. సినిమా చూసి రాత్రి పదిగంటలకి యింటి ముఖం పట్టారిద్దరూ. నగరం దాటి కొంతదూరం వెళ్ళేసరికి హైవే మీద తచ్చాడుతున్న రౌడీ ముఠా ఒకటి వీళ్ళిద్దర్నీ అటకాయించింది. భర్తని చెట్టుకు కట్టివేసి అతని కళ్ళెదుటే అతని భార్యని మానభంగం చెయ్యడానికి సిద్ధపడ్డారు వాళ్ళందరూ. అంతలో వారిలో ఒకడు భయంగా హైవే వేపు వేలితో చూపిస్తూ 'అటు చూడండని' గట్టిగా అరిచాడు. పల్లె దంపతుల్తో సహా అందరి చూపులూ అటు పక్క తిరిగాయి. ఎదురుగా నడిచి వస్తున్నాడో మహా పురుషుడు! అతని శిరస్సు చుట్టూ దేదీప్యమానంగా వెలిగిపోతోంది ఒక దివ్య కాంతి! ఆ దృశ్యం చూస్తూనే దుండగులు దడుసుకున్నారు. వెనక్కి తిరిగి చూడకుండా కాళ్ళకి బుద్ధి చెప్పారు. పల్లె దంపతులు చూస్తుండగానే ఆ మహా పురుషుడు వారిని సమీపించాడు. కాని వారి వంకైనా చూడలేదతను. అలానే నడుచుకుంటూ ముందుకి సాగిపోయాడు. కొద్ది క్షణాల తర్వాత తేరుకున్న పల్లె యువకుడి భార్య భర్త కట్లు విప్పింది. కృతజ్ఞతతో కళ్ళ వెంట అశ్రుధారలు కారుతూండగా ఆ మహా పురుషుడు వెళ్ళిన దిక్కుగా నమస్కరించి క్షేమంగా యింటికి చేరుకున్నారా దంపతులు. వర్ణనని బట్టి ఆ మహా పురుషుడెవరో కాదు... మొన్న రాత్రి హాస్పిటల్ నించి అదృశ్యమైన యోగి మాత్రమేనని మా విలేకరి గుర్తించాడు. యోగి నిస్సందేహంగా అవతార పురుషుడని చెప్పడానికి మరో ఆధారం కూడా లభించింది. మొన్న రాత్రి అపెండిసైటిస్‌తో బాధపడిన రోగి నిన్న ఉదయం తన జబ్బు నయమయిపోయిందని ఆశ్చర్యకర మైన రీతిలో ప్రకటించాడు. అతన్ని పరీక్షించిన డాక్టర్లు కూడా ఈ విషయం నిర్ధారించారు. ఈ విషయాలన్నీ విన్న ప్రజలు కొందరు యోగి కోసమని నిన్నంతా నగరం చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గాలించారు. కాని యోగి వారికి కనబడలేదు. అవసరమైతే తప్ప యోగి ఎవరికీ కనబడడని ప్రజల్లో మరో వదంతి వ్యాపించింది. మొత్తానికి యోగి ఉదంతం ఒక అంతుబట్టని మిష్టరీగా మారిపోయింది.'

రేప్ సంఘటన గురించి చదవగానే ప్రభుదాస్ శరీరం అసహ్యంతో నిండిపోయింది. రేప్ చేసే వాళ్ళంటే అతనికేదో జుగుప్స.

ప్రభుదాస్ కళ్ళలో తన తల్లి మెదిలింది.

తండ్రి చనిపోయాక ఆ గ్రామంలో వుండడం అసాధ్యమయిపోయింది తమకి. పొట్ట చేత్తో పట్టుకుని మరో గ్రామానికి తరలిపోయారు తల్లీ తనూ. దొరికినప్పుడల్లా కూలి చేసుకుంటూ దొరకనప్పుడు షావుకారు దగ్గర వడ్డీకి అప్పు తెచ్చుకుంటూ తనని పోషించసాగింది తల్లి. రెండేళ్ళు గడిచాక అప్పు తీర్చమని వేధించసాగాడు షావుకారు. చీటికీ మాటికీ యింటికి వచ్చి తల్లిని నానా దుర్భాషల్తో హింసించేవాడు. చివరికోరోజు బాకీకి బదులుగా ఆమె శరీరాన్ని వాంఛించాడతను. తిరస్కరించిన తన తల్లిని బలాత్కరించబోయాడు. హోరాహోరి జరుగుతున్న వారిద్దరి పెనుగులాటని చూస్తున్న తను తల్లిని రక్షించాలనే ఆవేశంతో దగ్గర్లో వున్న కత్తిపీట అందుకుని షావుకారు మెడమీద ఒక్క వేటు వేశాడు. ఎర్రటి రక్తం కళ్ళలోకి చిమ్మింది. అంతే... ఆ తర్వాత తన తల్లి గబగబా వచ్చి తన చీరకొంగుతో కళ్ళొత్తేదాకా ఏం జరిగిందో తెలీలేదు. పోలీసులొచ్చే సమయానికి కత్తిపీట తన చేతిలో పట్టుకుని సిద్ధంతా నిలబడి వుంది తన తల్లి. తానే షావుకార్ని హత్య చేసినట్లు వారందరి ముందూ ప్రకటించి అందరూ చూస్తుండగా అదే కత్తిపీటతో పొడుచుకుని ప్రాణాలు విడిచిందామె. ఆ


వెలువడినవి!

దోరవయసు జోరులో వ్యర్థ జీవితాన్ని గడిపే యువతీ యువకులకు కనువిప్పు కల్గించే
"ప్రఫుల్లచంద్ర" రచన
దోరవయసు జోరులో..........16/-

"మధులిక"తో తెలుగు నవలా ప్రపంచంలో సస్పెన్స్ స్థాయిని పెంచి, ఈ నవల ద్వారా, రొమాన్స్ కూడా అద్భుతంగా వ్రాయగలనని చాటి చెప్తున్న
"డా॥ కె. రవీంద్రబాబు" రచన
సుశ్రుతా నర్శింగ్ హోమ్......18/-
(ఆంధ్రపత్రిక సీరియల్)
మరియు
జి. భవానీ కృష్ణమూర్తి డైరెక్ట్ నవల
అనురాగ సంకేతం..........20/-

కామెడీ, సీరియస్‌నెస్ రెండింటినీ అద్భుతంగా పోషించగలిగిన ఏకైక రచయిత:
"యర్రంశెట్టి శాయి" రచనలు
నీ కలల బందీని..........16/-
మహానటి..........17/-
పాఠకులున్నారు జాగ్రత్త...20/-

మా వైజ్ఞానిక ప్రచురణలు
హిప్నాటిజం టి.యస్.రావ్.......15/-
హోమియో చికిత్స డా. నియాజ్...10/-
సర్జన్ సలహాలు డా. కె. రవీంద్రబాబు....15/-

పల్లవి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ-2

PRAGATHI • దేవ్...

రోజు షావుకారు కళ్ళలో కనిపించిన కామవాంఛ తనెప్పుడూ మరిచిపోలేదు. అందుకే తన అనుచరులెవరైనా రేప్ చేసినట్లు తెలిస్తే వారిని అక్కడిక్కడే కాల్చి చంపేస్తాడు తను.

భారంగా నిట్టూర్చాడు ప్రభుదాస్. అయితే యోగి కూడా తనలాగే రేప్ అంటే అసహ్యించుకుంటాడా?

ఊహు... తల గట్టిగా విదిల్చాడతను. యోగికివేం పట్టవ్. ఎవరెలాపోయినా అతను పట్టించుకోడు... కేవలం అతన్ని చూసి ప్రజలు భయభ్రాంతులవడం తప్ప అతను ప్రత్యేకించి ఎవర్నీ ఏమీ చెయ్యలేదు.

తన అనుచరులు కూడా యోగి పట్ల భయపడుతున్నారు. వారికా భయం పోగొట్టకపోతే త్వరలో విపరీత పరిణామాలు సంభవిస్తాయ్. తమ దారి నుండి యోగిని తొలగిస్తేనే కాని వారికా భయం పోదు.

"ప్రభూ... అందరూ వచ్చారు ప్రభూ"

ప్రభుదాస్ హాల్లోకి వెళ్ళాడు.

నేరుగా అర్ధవలయం మధ్యకి వెళ్ళాడు. అందరి కళ్ళలోకి నిశితంగా చూసాడు. నిశ్చలంగా వున్నాయ్ అందరి కళ్ళూ.

"యోగిని హత్య చేయాలి" సాధ్యమైనంత మామూలు స్వరంతో అన్నాడు.

అందరి కళ్ళూ కిందకి వాలిపోయాయి.

"యోగిని...హత్య...చేయాలి" అసహనంగా ఒక్కొక్క మాటే ఒత్తి పలుకుతూ రిపీట్ చేశాడు ప్రభుదాస్. తన ఆదేశానికి ప్రోపర్ రెస్పాన్స్ రాకపోవడంతో అతను తట్టుకోలేకపోతున్నాడు.

"ప...భు...దా!" కంగారు నణుచుకుందికి ప్రయత్నిస్తూ అన్నాడొక అనుచరుడు.

"డూ యాజ్ ఐసే... సంజాయిషీలొద్దు"

"ఎస్ బాస్"

అనుచరులందరూ బయటికి నడిచారు.

కుర్చీలో కూర్చుని విస్కీని గ్లాసులో వంపుకున్నాడు. ప్రభుదాస్ చేతిలో గ్లాసు జారిపడిపోయింది.

టేబిల్ నిండా విస్కీ...

అదేమిటో మూడు రోజులై తాగాలనిపించడం లేదు తనకి. ఇదంతా యోగి మహాత్యమా?

ఛత్... అద్భుతాలూ...మహాత్యాలూ...నథింగ్... అంతా మిథ్య...షియర్ ఫెంటాస్టిక్ నాన్సెన్స్... డర్టీ హల్లూసినేషన్స్

ఈ సమాజానికి తెలిసింది ఒకటే భాష... ద్వేషం...హింస... ప్రతీకారం.

అనుక్షణం తన తెలివితేటల్తో ప్రజల్ని మోసగించ గలిగిన వాడే నాయకుడు.

తన చర్యలతో ప్రజల గుండెల్లో నిద్రపోగలిగిన వాడే భగవంతుడు.

హింసని మించిన శక్తి మరొకటి లేదు.


మొండివాణ్ణి మించిన దైవం మరొకటి లేదు.

ఆలోచనల్తో సమయం తెలీలేదు ప్రభుదాస్‌కి. పని మీద వెళ్ళిన అనుచరులు తిరిగి వచ్చారు.

"ఏమయింది" ప్రశ్నించాడు.

మౌనమే సమాధానమయింది.

"ఏమయింది" దిక్కులు పిక్కటిల్లేటట్లుగా అరిచాడు.




"క్షమించండి ప్రభుదా... అతన్ని చంపడం మా వల్లకాదు" తలవంచుకుని జవాబిచ్చాడు ఓ అనుచరుడు.

"డామిట్" బల్ల గుద్దుతూ లేచాడు ప్రభుదాస్. ఆ విసురుకి విస్కీ బాటిల్ కూడా కింద పడిపోయింది.

"మీరెవ్వరూ చెయ్యలేని పని నేను చేస్తాను" పళ్ళు పటపట కొరుకుతూ అన్నాడు. "ఎక్కడున్నాడా యోగి"

"హైవే మీద... పదో నెంబరు మైలు రాయి దగ్గర"

రివాల్వర్ జేబులో వేసుకుని బయటికి నడిచాడు ప్రభుదాస్.

** ** **

ప్రశాంతంగా నిద్రపోతోంది ప్రకృతి. మోటార్ సైకిల్ హెడ్‌లైట్ కాంతిలో కన్పిస్తున్న కొద్దిదూరం తప్పిస్తే అంతా ప్రగాఢమైన చీకటి. ఆ వాహనం చేస్తున్న రొద తప్పిస్తే చుట్టూ భయంకరమైన నిశ్శబ్దం.

తొమ్మిది మైలు రాళ్ళు దాటిపోయాయి. పదో మైలురాయి దగ్గరవుతున్నాది.

ప్రభుదాస్ గుండె ఎన్నడూ లేని విధంగా కొట్టుకో సాగింది. చీకటిని చీల్చుకుంటూ అన్వేషిస్తున్నాయి అతని కళ్ళు.

హెడ్‌లైట్ వెలుగులో అస్పష్టంగా కన్పిస్తున్న ఓ ఆకారం క్రమంగా రూపు దిద్దుకోసాగింది.

అడిగో!

ఒంటరిగా వెళ్ళిపోతున్నాడా వ్యక్తి!

ప్రజల్లో, పత్రికల్లో సంచలనం సృష్టించిన మహా వ్యక్తి!

యోగి!

అరె...!

అంత వేగంగా ఎలా నడుస్తున్నాడతను. తను మోటర్ సైకిల్ పైన కూడా అందుకోలేకపోతున్నాడేమిటీ?

ప్రభుదాస్ వేగం పెంచాడు.

హమ్మయ్య!

యోగిని దాటగలిగేడు తను. అందరూ అనుకుంటున్నట్టు మానవాతీతమైన వ్యక్తేమీ కాడతను.

మోటరుసైకిల్ దిగి, రివాల్వర్‌ని సిద్ధంగా చేతిలో వుంచుకుని వెనక్కి తిరిగాడు ప్రభుదాస్...

యోగి సమీపించాడతన్ని...

ఆశ్చర్యం!

రివాల్వర్ పేలడం లేదు యోగి కళ్ళలో ఏదో సమ్మోహన శక్తి తనని వివశుణ్ణి చేస్తోంది.

ప్రభుదాస్‌ని దాటి వెళ్ళిపోయాడు యోగి.

మళ్ళీ అతని వెనుక పరిగెత్తాడు ప్రభుదాస్.

అతన్ని దాటి వెళ్ళి ఆయాసంగా రొప్పుతూ తిరిగి రివాల్వర్ గురిపెట్టాడు... అతని కెదురుగా నించుని.

అద్భుతం!

తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు ప్రభుదాస్.

ఏమిటీ వింత?

యోగి శిరస్సు చుట్టూ మనోహరమైన కాంతి పుంజం! ఒకసారి చూస్తే చాలు. తరించిపోతుందీ జన్మ అన్నట్టుగా వెలిగిపోతున్నాయి అతని నేత్రాలు!

"ప్రభుదాస్"

ఉలిక్కిపడి అటూ యిటూ చూసాడు ప్రభుదాస్.

ఎవరు పిలిచారు తనని?

తనూ యోగి తప్ప ఎవరూ కనబళ్ళేదు. యోగి వంక చూసాడు.

"ప్రభుదాస్!" మళ్ళీ అదే పిలుపు. కాని ఆశ్చర్యం! యోగి పెదాలు కూడా కదల్లేదు. మరయితే ఎవరు పిలుస్తున్నారు తనని? ఆ గొంతు తన గొంతు లాగే వుంది. తన శరీరంలోంచే ఎవరో తనని పిలుస్తున్నట్టుగా వుంది అది వింటూంటే.

"ప్రభుదాస్!" నీ కోసమే నేనెదురు చూస్తున్నాను" మళ్ళీ మాట్లాడింది ఆ గొంతు.

నాకోసమా? తనలో తాను ఆశ్చర్యపోయాడు ప్రభుదాస్.

"అవును... నీ కోసమే... పేరు చెప్తే చాలు ప్రజలందరూ గడగడలాడే ప్రభుదాస్ దాదావి నువ్వే కదూ?" అడిగింది ఆ గొంతు.

"అవును... నేనే" తన గొంతు తనకే విస్మయాన్ని కలిగిస్తూండగా అస్పష్టంగా గొణిగాడు ప్రభుదాస్.

"ప్రభుదాస్... యిలా భయంకరమైన హంతకుడిగా నువ్వెందుకు మారేవో నీకు తెలుసా?"

"తెలుసు" ముక్తసరిగా జవాబిచ్చేడు ప్రభుదాస్.

"ప్రభుదాస్... ఆ రివాల్వర్ కింద పడెయ్"

ప్రభుదాస్ చేతిలో రివాల్వర్ కిందకి జారిపోయింది.

"ప్రభుదాస్... జాగ్రత్తగా విను... హింసకి హింస విరుగుడు కాదు. అహింసా పరమో ధర్మః... నువ్వు నా మార్గాన్ని అనుసరించు. నా శిష్యుడిగా మారు... ప్రజలందరిలో నిద్రాణమై యున్న అహింసాజ్యోతిని ఉద్దీప్తం చెయ్యి... నీ మనస్సుకి శాంతి లభిస్తుంది"

భక్తితో మోకాళ్ళ మీద ప్రణమిల్లాడు ప్రభుదాస్. యోగి ముందుకి సాగిపోయాడు.

మనవి:

సిద్ధార్థుడు-అంగులిమాల కథ ఈ రచనకి ఇన్‌స్పిరేషన్. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ శ్రీహరిశర్మ ఆత్మజ్యోతికి ఈ కథ అంకితం.